# నేనూ - నా పాత్ర

ఒకరోజు రాత్రి నేను కన్నుమయ్యగానే నా కథల్లోని ఒకపాత్ర వొచ్చి నన్ను లేపింది.

నేను నిద్రమొహంతోనే, "ఏమిటి, ఇప్పుడొచ్చావ్?" అనిఅడిగాను.

నా పాత్ర బిక్కమొహం పెట్టుకొని, నన్నిట్లా చెయ్యటం మీకు న్యాయంకాదు. నన్ను సృష్టించి, నా కథంతా రాయకుండా, మధ్యలో విడిచిపెట్టటం మీకు న్యాయంకాదు. మీరెప్పుడూ నన్నిట్లాగే చేస్తున్నారు" అన్నది.

"నేను వ్రాసేది నీ కథకాదు. నేను రాసే కథల్లోకి కావలసిన అంశాలు నీ జీవితంలోంచి తీసుకుంటాను. మిగిలిన నీ జీవితం నా కనవసరం. నా చదువరులకు అనవసరం. వెళ్ళు నీ జీవితం రాయించుకోవాలని వుంటే ఈ వూళ్ళో చాలామంది కథకులు వున్నారు. వాళ్ళదిగ్గరకు వెళ్లు" అని మళ్ళీ నిద్రపోయాను.

ఇంతవరకు ఆ పాత్ర మళ్ళీ నా మీద కంప్లెయింటు చెయ్యలేదు.